## మహిళలు స్వయం సాధికారిత సాధించాలి



కుట్టు మిషన్లు అందజేస్తున్న పద్మశ్రీ ఏఎస్ నారాయణ

- పద్మశ్రీ ఏఎస్ నారాయణ

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 15 : మహిళలు స్వయం ఉపాధితోపాటు ఆర్థిక అభివృద్ధి, సాధికారత సాధించాలని పద్మశ్రీ డాక్టర్ ఏఎస్ నారాయణ అన్నారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ పొందిన 45 మంది మహిళలకు రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి అందించిన రూ.3లక్షల విలువైన కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ నారాయణ మాట్లాడుతూ మానవత్వం, సమానత్వం, ప్రేమ తత్వం బోధించిన సాయినాథుడి స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో సాహితీవేత్త బడుగు శ్రీరాములు, ఫ్యాషన్ డిజైనర్ కష్ణమూర్తి, ఎస్ఐ జగన్, ఏపీఎం యాదయ్య, పర్ని శివారెడ్డి, సుక్క సుదర్శన్, చిలువేరు హరిప్రసాద్ పాల్గొన్నారు.

## దేశ సమైక్యతను విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ సర్కారు

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట, ఏప్రిల్ 15 : దేశ సమైక్యతను, ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జెల్లెల పెంటయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నకర పాలన కొనసాగిస్తుందన్నారు. గవర్నర్ వ్యవస్థను వాడుకొని బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, శ్రీనివాసచారి, వెంకటేశం, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

## ఆలేరు బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బార్ అసోసియేషన్ కార్యవర్గం

ఆలేరు టౌన్, ఏప్రిల్ 15 : ఆలేరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికల అధికారులు హనుమంతు, సిద్ధులు, మురళీకృష్ణ నేతృత్వంలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు మిరియాల వనమరాజు, ఉపాధ్యక్షుడు తుంగ హరికృష్ణ,, ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా, సహాయ కార్యదర్శి రావుల రవీందర్, కోశాధికారి పారునది రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ తాజా మాజీ అధ్యక్షుడు జూకంటి రవీందర్ నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ న్యాయవాదులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి హక్కుల కోసం కృషి చేస్తామన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్‌హెచ్ఓ భీముడు

మోత్కూరు, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాలను అవగాహనతోనే నివారించుకోవచ్చని మోత్కూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఆర్.భీముడు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలు, ప్రయాణికులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫైర్ మెన్ ఎస్.రామచంద్రయ్య, సిబ్బంది సీహెచ్ జితేందర్, బి.సాయిరాం, ఎండీ సిద్దిక్, సీఎం ప్రభుజ్యోతి పాల్గొన్నారు.


## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



పాఠశాలకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దివీస్ పరిశ్రమ ప్రతినిధులు

చౌటుప్పల్, ఏప్రిల్ 15 : పట్టణంలోని తెలంగాణ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ పోటీ పరీక్షల కోసం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు అధ్యాపకుల ఉపకార వేతనాల కోసం రూ.2.40లక్షలు, పాఠశాలకు పర్నీచర్ బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరోజమ్మ, పరిశ్రమ ప్రతినిధులు బి.గోపి, సాయికృష్ణ పాల్గొన్నారు.

## పాఠశాలకు 50 కుర్చీలు, బీరువాలు బహూకరణ



పాఠశాలకు బీరువా, సామగ్రిని అందజేస్తున్న రామకృష్ణ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 15 : మండలంలోని అనంతారం బీసీ వెల్ఫేర్ సంక్షేమ పాఠశాలకు వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ 50 కుర్చీలు, 5 బీరువాలను ప్రిన్సిపాల్ స్వప్నకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



నాంచారిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి

మోటకొండూర్, ఏప్రిల్ 15 : మండలంలోని చాడ, ముత్తిరెడ్డిగూడెం, నాంచారిపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గంధమల్ల జహంగీర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో డీటీ జయలక్ష్మి, ఆర్ఐ రామారావు, ఏఈఓ వెంకటేశ్ పాల్గొన్నారు.

## రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఆలోచనలో ప్రభుత్వం

- అధికారులకు ఇండ్ల నిర్మాణాల దత్తత
- కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలోనే రెవెన్యూ ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మూడు నెలల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని, తొలి విడుతలో భాగంగా రెండు, మూడు రోజుల్లో రూ.లక్ష చొప్పున డబ్బులు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 66 మంది బేస్‌మెంట్ లెవల్ నిర్మాణ పూర్తి చేసుకున్నారని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకకు ఎలాంటి ఇబ్బందులు లేవని, సిమెంట్, స్టీల్ సైతం తక్కువ ధరకే ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వేగవంతానికి ఒక్కో గ్రామంలో లబ్ధిదారులను నాలుగు భాగాలుగా విభజించి అధికారులకు దత్తత ఇచ్చామని చెప్పారు. తాసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఎస్ఐలకు బాధ్యతలు అప్పగించామని, ఇండ్లు పూర్తయ్యే వరకు వారే పర్యవేక్షిస్తారని వెల్లడించారు. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేశారని, ఏ గ్రామానికి ఎన్ని అనేది త్వరలోనే తేలిపోతుందని అన్నారు. తొలి విడుతలో అత్యంత పేదలకు ప్రాధాన్యం ఇస్తామని, వారికి మే 7న మంజూరు కాపీలు అందిస్తామని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి పేదలకు డబ్బులకు ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. భూ భారతిలో భాగంగా అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నీటి సరఫరా, మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.కోటి విడుదల చేసిందన్నారు.

## ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి

- భూ భారతిపై 17నుంచి అవగాహన సదస్సులు
- కలెక్టర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 15 : అధికారులు గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి తాగునీటి సమస్య, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, సంక్షేమ పథకాలపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మే, జూన్ నెలల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. గ్రామాల్లో చేతి పంపులు, బోరు బావులకు తక్షణమే మరమ్మతులు చేయాలని, అవసరాన్ని బట్టి బోర్లు వేయాలని, ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లల్లో నిరు పేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల్లోని కుటుంబ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. భూ భారతి, కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రెవెన్యూ అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏప్రిల్ 17 నుంచి 30 వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ రేషన్ కార్డులు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేసి పెండింగ్ లేకుండా చూడాలని తాసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, తాసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, హౌజింగ్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ బోర్డులో సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి

మోటకొండూర్, ఏప్రిల్ 15 : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారిందన్నారు. ఆన్‌లైన్ అప్‌డేట్ పేరుతో కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, కార్మిక సంక్షేమ బోర్డులో జమ కావాల్సిన సెస్ సక్రమంగా వసూలు చేయకపోవడం వల్ల కార్మిక సంక్షేమ నిధులు పెరుగడం లేదని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, నాయకులు కళ్లెం కృష్ణ, చెక్క వెంకటేశ్, హరిచంద్ర, మాణిక్యం, పిల్లి శంకర్, మల్లేశ్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

## నిచ్చెన పైనుంచి పడి వ్యక్తి మృతి



పాండరి (ఫైల్)

రాజాపేట, ఏప్రిల్ 15 : భవనం ఎక్కుతుండగా.. ప్రమాదవశాత్తు నిచ్చెన పైనుంచి జారి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని సింగారం గ్రామంలో మంగళవారం జరిగింది. సింగారం గ్రామానికి చెందిన చెన్నూరి పాండరి (60) భవనం పై ఉన్న పాత సామగ్రి తీయడానికి కట్టెతో తయారు చేసిన నిచ్చెన వేసుకొని ఎక్కుతుండగా.. ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవఖానకు తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## బీసీ గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి 20న పరీక్ష

బీబీనగర్, ఏప్రిల్ 15 : మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 20న కళాశాలలో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలిగొండ మండలానికి చెందిన బీసీ గురుకుల పాఠశాల బీబీనగర్ మండల కేంద్రంలోని టీడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతుందని, బీబీనగర్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష కంద్రం అడ్రస్ విషయంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందని తెలిపారు. బీబీనగర్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల టీడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష ఉంటుందని, సమయానికి ముందే హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి 1083 దరఖాస్తులు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 15 : రాజీవ్ యువ వికాసం పథకానికి మండలంలో 1,083 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాములునాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎస్సీ అభ్యర్థులు 311 మంది, బీసీలు 652, ఎస్టీలు 25, మైనార్టీలు 45, ఓసీలు 50మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## నేడు దిశ సమావేశం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 15 : కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

## నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

బీబీనగర్, ఏప్రిల్ 15 : మండలంలోని చిన్నరావులపల్లి గ్రామ పరిధిలో బీబీనగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభిస్తారని సొసైటీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభ కార్యక్రమానికి పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు హాజరు కావాలని కోరారు.

## నీర్నెముల గ్రామంలో వడగండ్లు

రామన్నపేట, ఏప్రిల్ 15 : మండలంలోని నీర్నెముల గ్రామంలో మంగళవారం వడగండ్ల వర్షం కురిసింది. దాంతో చేతికి వచ్చిన వరి పంట నేలపాలైంది. వివిధ చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.



నీర్నెములలో ధాన్యంలో పడిన వడగండ్లను తీసి కుప్ప పోసిన రైతు



నీర్నెముల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యంలో పడిన వడగండ్లు

## ‘భవన నిర్మాణ సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలి‘



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 15 : భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రభుత్వం బలోపేతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన భవన నిర్మాణ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి పాలకుల విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మృతిచెందితే రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు ఉప్పల ముత్యాలు, హరిచంద్ర, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కూరెళ్ల మత్స్యగిరి, మండల అధ్యక్ష, కార్యదర్శులు మత్స్యగిరి, మల్లేశ్ పాల్గొన్నారు.

## తిరుమల రాయినిగూడెంలో మంచినీటికి ఇక్కట్లు

- పైపులైన్ శిథిలావస్థలోకి చేరడమే కారణం



గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

శాలిగౌరారం, ఏప్రిల్ 15 : మండు వేసవి కావడంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని నీళ్లతో కాలం వెల్లదీస్తున్నారు. మండలంలోని తిరుమల రాయినిగూడెం గ్రామ పంచాయతీలో రెండు బోర్ల ద్వారా కొన్నేండ్లుగా మంచినీటిని అందిస్తున్నారు. అందులో ఒక బోరు చెడిపోవడంతో ఉన్న మరొక్క బోరుతోనే గ్రామానికి మంచినీటిని అందిస్తున్నారు. 10 ఇండ్ల ప్రజలకు గ్రామ పంచాయితీ ద్వారా నీరందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

### శిథిలావస్థలో పైపులైన్

తిరుమల రాయినిగూడెం గ్రామానికి మంచినీటిని సరఫరా చేసేందుకు గతంలో పైపులైన్ వేశారు. ప్రస్తుతం ఆ పైపులైన్ పూర్తిగా శిథిలావస్థలోకి చేరడంతో నీరు సక్రమంగా చేరడం లేదు. దాంతో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ఐకేపీ సెంటర్‌లో ధాన్యం చోరీ

అడ్డగూడూరు, ఏప్రిల్ 15 : మండలంలోని కోటమర్తి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం దొంగిలించారు. బాధితుడి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీలం మధు సోమవారం సాయంత్రం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్ప చేసి పట్టాలు కప్పి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి పట్టాలు తీసి ఉన్నాయి. అందులో సుమారు 10 బస్తాల ధాన్యం పోయినట్లు గుర్తించాడు.

## బీఆర్ఎస్వీ పాదయాత్రకు తరలిన నాయకులు



గుడి మల్కాపురం నుంచి పాదయాత్రగా బయల్దేరిన బీఆర్ఎస్వీ నాయకులు

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 15 : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతం కావాలని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వేములకొండ గుట్ట నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్రకు మంగళవారం మండలం నుంచి విద్యార్థి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకుల పాదయాత్రను మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు శివరాత్రి విద్యాసాగర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం మురళీధర్‌రెడ్డి, మన్నె చిత్రసేనారెడ్డి, సిద్ధగోని శ్రీను, శ్రీరాం, రమేశ్, శ్రీకాంత్, ఫర్హాన్, మహేందర్, తరుణ్ నాయక్ పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

తుర్కపల్లి, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచులు కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, పోగుల ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ కర్ణాకర్, నాయకులు రవీందర్, హరినాయక్, వెంకట్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

బొమ్మలరామారం, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని మల్యాల గ్రామంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా సభకు కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు జూపల్లి భరత్, మైలారం సుదర్శన్, బండి మహేశ్‌గౌడ్, నర్సింహ, నాగేశ్ పాల్గొన్నారు.

## ‘న్యాయవాదుల చట్ట సవరణను సమీక్షించాలి’



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 15 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల న్యాయవాద చట్టం 1961కి మార్పులు చేస్తూ చట్టం చేయడం పట్ల న్యాయవాద వృత్తి ప్రమాదంలో పడుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్ అన్నారు. అమైండ్‌మెంట్‌పై లాయర్స్ యూనియన్ ముద్రించిన బుక్‌లెట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవరణ బిల్లుతో బార్ కౌన్సిల్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. న్యాయవాదుల చట్ట సవరణను సమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యాపాల కృష్ణారెడ్డి, మామిడి వెంకట్‌రెడ్డి, యాదాసు యాదయ్య, చుక్క శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ‘బడి బయటి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి’



ఇంటికి వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రమేశ్

రాజాపేట, ఏప్రిల్ 15 : బడి బయటి పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ చందా రమేశ్ కోరారు. మండలంలోని కొత్త జాల గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి బడి బయటి పిల్లలతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను గుర్తించి నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన బోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, విజయలక్ష్మి, సరిత, ఇందిర పాల్గొన్నారు.

## గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న హరికృష్ణ

రామన్నపేట, ఏప్రిల్ 15 : గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన కక్కిరేణి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆసరా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్కిరేణి గ్రామానికి చెందిన 10 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్ష రాయగా.. ఆరుగురు సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బిమ్మిడి ఉపేందర్, ఉపాధ్యాయులు గణేశ్, గోపాల్‌రెడ్డి, కృష్ణ, సామాజిక కార్యకర్త వేముల సైదులు పాల్గొన్నారు.

## జీవాలను పర్యవేక్షణలో ఉంచుకోవాలి : రాజలింగం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 15 : మున్సిపాలిటీలోని పశువులు, మేకలు, గొర్రెల యజమానులు జీవాలను వదిలివేయకుండా తమ పర్యవేక్షణలో ఉంచుకోవాలని, లేకుంటే గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ రాజలింగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులను వదిలివేయడంతో పట్టణంలోని ప్రధాన రహదారులపై సంచరిస్తూ వాహనాల ప్రమాదాలకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. పాదచారులను పొడుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. పశువులను వదిలి పెట్టకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.